సాక్షి గుంటూరు

బుధవారం । 13 । డిసెంబర్ । 2023




అయ్యప్పస్వామి నగరోత్సవం

బాపట్లఅర్బన్: పట్టణంలో మంగళవారం నిర్వహించిన అయ్యప్పస్వామి నగరోత్సవం వైభవంగా సాగింది. ప్రత్యేక అలంకారంలో కొలువుదీరిన స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు.



సంపూర్ణ భగవద్గీత పారాయణం

పాత గుంటూరు: గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అఖండ అహోరాత్ర సప్తహ, సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 522.30 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీలో పలువురికి పదవులు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మహిళ, యువజన విభాగం రాష్ట్ర కమిటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన పలువురిని పలు పదవుల్లో నియమించారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. మహిళా విభాగం రాష్ట్ర అధికారప్రతినిధిగా గుంటూరుకు చెందిన గాలి అరవింద, కార్యదర్శిగా దాసరి దరియాబీ, సహాయ కార్యదర్శులుగా పెద్దిరెడ్డి సామ్రాజ్యం, బండ్లమూడి రోజారాణి, వెంకటశేషకుమారి (శ్రీరెడ్డి)లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా గుంటూరుకు చెందిన కళ్లం హరికృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా భవనం వంశీరెడ్డి, కార్యదర్శిగా జొన్నల అవినాష్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా సలివేంద్ర సురేష్‌లను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

రేపు మినీ జాబ్ మేళా

నరసరావుపేట: జిల్లా కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించే నవోదయం కార్యక్రమంలో భాగంగా మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కె.సంజీవరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్‌మేళాకు హెటిరో డ్రగ్స్, మిట్టపల్లి స్పిన్నర్స్ ప్రైవేటు లిమిటెడ్, ప్రదక్షిణ ఫిన్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి మూడు రకాల కంపెనీలు హాజరవుతాయని తెలిపారు. జీతం వారి విద్యార్హతను బట్టి సుమారు రూ.10 వేలు నుంచి రూ.25 వేల వరకు ఉంటుందన్నారు. ఈ జాబ్ డ్రైవ్‌కు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ విభాగాల వరకు చదువుకున్న 18 నుంచి 30 ఏళ్ల వయసు మధ్యనున్న నిరుద్యోగ యువతి, యువకులు వారి బయోడేటా, రెజ్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. నియోజకవర్గ పరిసర ప్రాంత యువతీ, యువకులు అందరూ ఈ మేళాలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యార్డుకు 55,391 బస్తాల మిర్చి రాక




కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 55,391 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 52,996 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 24,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.13,000 నుంచి రూ.21,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 24,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 19,811 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నేడు పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్ : గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ ఫార్మసీ కోర్సులో భర్తీ కాగా, మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు బుధవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ బైపీసీ, ఎంపీసీ రెగ్యులర్, దూరవిద్య ద్వారా పూర్తి చేసిన విద్యార్థినులు ప్రవేశం పొందుటకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో బుధవారం ఉదయం 9 గంటలకు నేరుగా కళాశాలకు వచ్చి రూ.6,300 ఫీజు చెల్లించి ప్రవేశం పొందాలని సూచించారు. కళాశాల ప్రాంగణంలో వసతి గృహ సదుపాయం సైతం ఉందని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ ద్వారా సీటు పొందు విద్యార్థినులకు ఫీజు రాయితీ, స్కాలర్‌షిప్ వర్తించవని, ఇతర సమాచారానికి 98480 38769, 99593 24563 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మ కాయల కనిష్ట ధర రూ.1,500, గరిష్ట ధర రూ.2,300, మోడల్ ధర రూ.1,900 వరకు పలికింది.

రైతులకు అండగా ప్రభుత్వం

- పంట నష్ట నమోదుకు సహకరించాలి
- జాయింట్ కలెక్టర్ రాజకుమారి



వట్టిచెరుకూరు మండలంలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న జేసీ రాజకుమారి, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, ఉద్యానశాఖ డీడీ రవీందర్ తదితరులు

ప్రత్తిపాడు: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి చెప్పారు. వట్టిచెరుకూరు మండలంలో ప్రారంభమైన పంటల ఎన్యూమరేషన్ ప్రక్రియను మంగళవారం జేసీ రాజకుమారి వ్యవసాయ, ఉద్యానశాఖ జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. తొలుత అనంతవరప్పాడు, లేమల్లెపాడు, కాట్రపాడులో మిర్చి, వట్టిచెరుకూరులో వరి పొలాలతోపాటు కారంపూడిపాడులో తడిసిన ధాన్యాన్ని జేసీ పరిశీలించి రైతులతో మాట్లాడారు. పూర్తిగా నష్టపోయామని పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ తమను ఆగమాగం చేసిందని రైతులు జేసీ ఎదుట వాపోయారు. స్పందించిన జేసీ పంటలు నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని వివరించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతులు కోరారు. భారీ వర్షాలు వచ్చిన సమయాల్లో పొలాల్లోని నీరు త్వరగా బయటకు వెళ్లేలా డ్రెయిన్లలో పూడికతీసి అడ్డంకులు తొలగించాలని జేసీకి విన్నవించారు.

18 వరకు ఎన్యూమరేషన్ ప్రక్రియ

ఈ సందర్భంగా జేసీ రాజకుమారి మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన పంటల ఎన్యూమరేషన్ మంగళవారం నుంచి ప్రారంభమైందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ డిసెంబర్ 18 వరకు జరుగుతుందని, పంట నష్టం అంచనాల వివరాలను డిసెంబర్ 18వ తేదీ నుంచి 22 వరకు సోషల్ ఆడిట్ కోసం సచివాలయాల్లో ప్రదర్శిస్తామని తెలిపారు. జాబితాలపై అభ్యంతరాలు ఉంటే స్థానిక అధికారుల దృష్టికి తీసుకువస్తే మరోసారి పరిశీలించి, తుది జాబితాలను డిసెంబర్ 26న ప్రభుత్వానికి సమర్పిస్తామని పేర్కొన్నారు.

రైతులు సహకరించాలి

గ్రామ స్థాయిలో రైతుభరోసా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారి, పంచాయతీ సెక్రటరీ క్షేత్ర స్థాయిలో పొలాలను పరిశీలించి వివరాలను నమోదు చేస్తారని జేసీ రాజకుమారి తెలిపారు. ఎన్యూమరేషన్ అధికారులు పొలాల వద్దకు వచ్చినప్పుడు రైతులు అందుబాటులో ఉండి వివరాలు తెలియజేసి సహకరించాలన్నారు. నష్టం జరిగిన ప్రతి పొలాన్నీ ఎన్యూమరేషన్ అధికారులు స్వయంగా పరిశీలించిన తర్వాత మాత్రమే నమోదు చేస్తారని స్పష్టం చేశారు. ఆలస్యంగా పొలాలు సాగు చేసిన వివరాలను ఈ-క్రాప్ బుకింగ్‌లో నమోదు చేయటానికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని, ఈ-క్రాప్‌లో పంట నమోదు చేయించుకోని రైతులు వెంటనే వ్యవసాయ సహాయకుల ద్వారా నమోదు చేయించుకోవాలని కోరారు. ఎన్యూమరేషన్ సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. కల్లాల్లో తడిచిన ధాన్యం శాంపిల్స్ తీసుకొని, నష్టంపై పూర్తి నివేదికను అందించాలన్నారు. జేసీ వెంట గుంటూరు ఆర్డీవో శ్రీకర్, జిల్లా వ్యవసాయశాఖాధికారి నున్న వెంకటేశ్వర్లు, ఉద్యానశాఖ డెప్యూటీ డైరెక్టర్ రవీందర్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు జి.లక్ష్మి, ఏడీఏ శ్రీనివాసరావు, హార్టికల్చర్ సైంటిస్టు డాక్టర్ గిరిధరరావు, డీసీఎంఎస్ మేనేజర్ హరిగోపాల్, తహసీల్దార్ నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరారాధనోత్సవాలు ప్రారంభం



వీరుల గుడికి వీర గంధం తెస్తున్న వీరాచారవంతులు

- తరలివచ్చిన వీరాచారవంతులు
- ఆయుధాలకు భక్తిశ్రద్ధలతో పూజలు
- ఉత్సాహంగా రాచగావు

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో పల్నాటి వీరారాధన ఉత్సవాలు మంగళవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి వీరాచారులు వీరుల గుడి ప్రాంగణానికి తరలి వస్తున్నారు. రణక్షేత్రం పొలిమేరలో తూర్పున ఉన్న కళ్లిపోతురాజు మండపం వద్ద పోతురాజుకు కొబ్బరి కాయలు కొట్టి అక్కడి నుంచి వీరుల గుడికి వస్తున్నారు. ఇదిలా ఉంటే వీరుల గుడికి వెల్లవేసే కార్యక్రమం కొనసాగింది. వీరుల గుడిలో ఉన్న ఆయుధాలను బయట పెట్టి పూజారులు గుడి మొత్తాన్ని శుభ్రం చేశారు. వీరుల ప్రతిరూపంగా ఉన్న వీర గల్లులను శుద్ధి చేసి పసుపు పూసి పూజకు సిద్ధం చేశారు. సాయంత్రం వీరుల గుడి పూజారుల్లో ఒకరైన పూజల పెదనరసింహ ఇంటి నుంచి వీరుల ఆయుధాలకు నూతన వస్త్రాలు తెచ్చారు. మరో పూజారి పూజల చిన నరసింహ ఇంటి నుంచి వీర గంధం తీసుకు వచ్చారు. అనంతరం వీరుల గుడిలో ఉన్న పల్నాటి వీరుల ఆయుధాలను నాగులేరు గంగధారి మడుగులో శుభ్రం చేశారు. పూజారులు స్నానాలు చేశారు. అనంతరం వీరుల గుడిలోకి ఆయుధాలను తరలించి అక్కడ పసుపు పూసి కొనలకు తిరునామాలు దిద్దారు. నూతన వస్త్రాలు, పూలమాలలతో ఆయుధాలను అలంకరించారు.

చెన్నకేశవస్వామి దర్శనం

వీరాచారవంతులు తమ ఆయుధాలతో తొలుత చెన్నకేశవస్వామిని దర్శించుకుని బ్రహ్మనాయుడు విగ్రహానికి తులసి, పూలమాలలు వేసి ధూపం వేశారు. అనంతరం వీర్ల అంకాలమ్మ తల్లి ఆలయానికి తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ ఉత్తర ద్వారం ద్వారా బాలచంద్రుని పాట్టీలు పాదముద్రలు ఉన్న చోట ఆచారవంతులు ఆగి తర్వాత కోట బురుజు మీదగా పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఇంటికి చేరుకున్నారు. అక్కడి నుంచి తరుణ్ చెన్నకేశవతో కలసి వీరుల ఆయుధాలతో ఊరేగింపుగా రాత్రికి వీరుల గుడికి చేరుకున్నారు. వీరుల గుడి ముఖ మండపం మీద పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ ఎర్ర జెండాను ప్రతిష్ఠించారు. వీరుల ఆయుధాలను గుడిలో కొలువుదీర్చారు. వీరాచారులకు పీఠాధిపతి వీరుల గుడి ఆవరణలోని మండపంలో కంకణధారణ చేశారు. తాంబూలాలిచ్చారు.

అర్ధరాత్రి రాచగావు

ఈ కార్యక్రమాలు పూర్తయ్యే సరికి రాత్రి 12 గంటలైంది. సరిగ్గా అర్ధరాత్రి రాచగావు కార్యక్రమాన్ని ఆచారవంతుడు పోతురాజు నిర్వహించారు. రాచగావు వీరుల ఆత్మశాంతి కోసం నిర్వహించిన రహస్య క్రతువులా కొనసాగింది. పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ సమక్షంలో వీరుల గుడి పూజారులైన పూజ గొల్లలు పెదరసరసింహ, ఏడుకొండలు, నర్సయ్య, చిననరసింహారావు తదితరులు వీరాచారవంతులు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం దర్శి ముక్కంటి రాచగావు కథాగానాన్ని పల్నాటి వీరుల గుడి ముందు మండపంలో ఆలపించారు. వీరజోళ్లు, సన్నాయి వాయిద్యాల మధ్య కత్తి, డాలు పట్టిన వీరవిద్యావంతుడు ముక్కంటి కథాగానాన్ని ఆలపిస్తూ అభినయించాడు. రాచగావు ఉత్సవం నాడు వీరాచారుల ఆచార వ్యవహారాలు కొనసాగాయి. పీఠాధిపతి తరుణ్‌చెన్నకేశవ, పీఠం నిర్వాహకుడు విజయ్‌కుమార్ పర్యవేక్షణలో వీరాచారులు రాచగావుతో వీరారాధనకు శ్రీకారం చుట్టారు.

స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ ప్రారంభం

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 67వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల స్కూల్‌గేమ్స్ అండర్-17, అండర్-19 బాల బాలికల అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి దాదాపు 1,400 మంది క్రీడాకారులు, 200 మందికి పైగా వ్యాయామ ఉపాధ్యాయులు, అధికారులు పోటీలకు హాజరయ్యారు. తొలిరోజు పోటీలో భాగంగా బాలికల 100 మీటర్ల పరుగు పందెంలో అండర్-17 విభాగంలో బి.జాహ్నవి (పశ్చిమగోదావరి), బి.శైలజ (విశాఖ), బి.నందిని (విజయనగరం), అండర్-19 విభాగంలో ఎస్.లావణ్య (అనంతపురం), ఆర్.సాయిప్రియ (కర్నూల్), ఎం.బాలాంజలి (విజయనగరం), బాలుర అండర్-19 విభాగం 100మీటర్లు పరుగులో వి.హిమతేజ (నెల్లూరు), పి.వెంకటేష్ (విజయనగరం), ఎం.మనోహర్‌నాయక్ (వైఎస్సార్ కడప), అండర్-17 విభాగంలో కె.ఎస్.ఎస్.సాహిల్‌బాబు (పశ్చిమగోదావరి), బి.సుకుమార్ (పశ్చిమగోదావరి), ఎస్.శంకర్‌నాయక్ (వైజాగ్) గెలుపొందారు. అలాగే బాలికల విభాగం అండర్-17 షాట్‌పుట్ పోటీలో ఈ.హేమసాయి (గుంటూరు),ఎండి.ఆషియా (గుంటూరు), కె.సుబ్బలక్ష్మి(వైజాగ్), బాలుర అండర్-17 విభాగంలో వి.సింహాచలం (వైజాగ్), పి.రాజశేఖరరెడ్డి (వైజాగ్), ఆర్.నాగవినయ్ (కృష్ణా), అండర్-19 విభాగంలో టి.చంద్రశేఖర్ (వైజాగ్), పి.నరేంద్రకుమార్ (వైజాగ్), సిహెచ్.అజయ్ (గుంటూరు) విజయం సాధించారు.

ఆరోగ్య 'సౌభాగ్యం'

- ముస్కాన్‌లో తెనాలి జిల్లా ఆస్పత్రికి క్వాలిటీ సర్టిఫికెట్
- రాష్ట్రంలోనే సర్టిఫికెట్ పొందిన మూడు దవాఖానాల్లో అత్యధిక స్కోరు
- ఈ ఏడాది ఎన్‌కాస్, లక్ష్య, కాయకల్ప వంటి జాతీయ సర్టిఫికెట్లూ సాధన



ఆస్పత్రిలో గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తెనాలి: చిన్నారులకు స్నేహపూర్వ వైద్య సేవలను అందించడానికి ఉద్దేశించిన 'ముస్కాన్'లో భాగంగా నిర్దేశిత ప్రమాణాలు పాటించిన తెనాలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ జాతీయస్థాయి క్వాలిటీ సర్టిఫికెట్‌కు ఎంపికైంది. ఇదే ఏడాది ఈ ఆస్పత్రి 'ఎన్‌కాస్', 'లక్ష్య', 'కాయకల్ప' వంటి జాతీయ సర్టిఫికెట్లను సాధించటం విశేషం.

పిల్లల సంరక్షణకు నాణ్యమైన సేవలు

చిన్నారులకు స్నేహపూర్వక వైద్యసేవలను అందిస్తూ మరణాల రేటును తగ్గించాలనే భావనతో కేంద్రప్రభుత్వం 2021లో ముస్కాన్‌ను ప్రారంభించింది. పుట్టిన బిడ్డ నుంచి 12 ఏళ్ల వయసు వరకు చిన్నారులకు నాణ్యమైన స్నేహపూర్వక వైద్యసేవలను అందించేందుకు దీనిని రూపొందించారు. నవజాత శిశువులు, పిల్లల ఆరోగ్య పరిరక్షణ, మరణాలను తగ్గించటం లక్ష్యం. అంతేకాకుండా పిల్లల శారీరక, మానసిక, సామాజిక అభివృద్ధితో సహా పిల్లల పెరుగుదల, అభివృద్ధికి సంబంధించిన అన్ని కీలక అంశాల సాధన ముఖ్య ఉద్దేశం. ముస్కాన్‌తో దేశంలోని ప్రజాసౌకర్యాల్లో పిల్లల సంరక్షణ సేవల నాణ్యతలో స్పష్టమైన మెరుగుదలను సాధించాలనే కృషి కొనసాగుతోంది.



కోస్తాంధ్రలోనే ఏకైక ఆస్పత్రి

భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబసంక్షేమ మంత్రిత్వశాఖ తాజాగా ప్రకటించిన జాబితాలో ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రమాణాలకనుగుణంగా క్వాలిటీ సర్టిఫికేషన్‌ను సాధించినవి కేవలం మూడే ఆస్పత్రులు. వీటిలో రెండు చిత్తూరు జిల్లాలోని కుప్పం, పలమనేరు ఏరియా ఆస్పత్రులు. మూడోది తెనాలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి. పలమనేరు, కుప్పం ఏరియా ఆస్పత్రుల స్కోరు 80, 81 కాగా, అత్యధికంగా తెనాలి ఆస్పత్రి 92 శాతం స్కోరుతో సర్టిఫికేషన్ సాధించింది.

కాయకల్ప ప్రథమ బహుమతి

సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలోని తెనాలి జిల్లా ఆస్పత్రి ఇదే ఏడాది ఎన్‌కాస్, లక్ష్య, కాయకల్ప వంటి జాతీయ గుర్తింపు కలిగిన సర్టిఫికెట్లను సాధించింది. ప్రజారోగ్య సౌకర్యాల్లో ఏడు ప్రధాన విభాగాల్లో 74 స్టాండర్డ్స్, 808 చెక్‌పాయింట్స్‌లో 83 శాతం స్కోరుతో నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌కాస్) సర్టిఫికేషన్ గెలుచుకుంది. లేబర్‌రూమ్/ మెటర్నటీ ఆపరేషన్ థియేటర్స్‌లో తల్లీబిడ్డల వైద్యసేవల్లో 93 శాతం స్కోరుతో మరోసారి జాతీయ గుర్తింపును అందుకుంది. క్లీన్లీనెస్, హైజీన్, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ వంటి ఆరు విభాగాల్లో 500 చెక్ పాయింట్లలో ప్రమాణాలను పెంచుకుని ఆంధ్రప్రదేశ్‌లోనే 'కాయకల్ప' నుంచి ప్రథమ బహుమతిని గెలుచుకుంది.

గర్వకారణం



సేవల నాణ్యతలో మేం సాధించిన విజయాలు గర్వకారణంగా ఉన్నాయి. స్పెషలిస్టు వైద్యుల భర్తీ, ఆధునిక యంత్ర పరికరాల సమకూర్చిన ప్రభుత్వం, వైద్యులు, సిబ్బంది తోడ్పాటు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం ఈ విజయాలకు కారణం. ప్రజలకు మరిన్ని ఉత్తమ సేవలను అందించటానికి, ప్రతిఒక్కరూ ఆస్పత్రిని తగినవిధంగా అభివృద్ధి చేయటానికి సహకరిస్తారని ఆశిస్తున్నాం.

– డాక్టర్ సౌభాగ్యవాణి, సూపరింటెండెంట్

తూనికలు, కొలతల్లో తేడాలొస్తే చర్యలు

జిల్లా తూనికలు, కొలతలశాఖ డిప్యూటీ కంట్రోలర్ ఐజాక్

చీరాలటౌన్: తూనికలు, కొలతల్లో తేడాలొస్తే చర్యలు తీసుకుంటామని.. తూనికలు, కొలతలపై సచివాలయాల పరిధిలో నివాసం ఉంటున్న ప్రజలందరికి అవగాహన కల్పించాలని జిల్లా తూనికలు, కొలతలశాఖ డిప్యూటీ కంట్రోలర్ ఐజాక్ సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయం సమావేశ హాలులో తూనికలు, కొలతలశాఖ ఆధ్వర్యంలో సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ప్రభుత్వం తూనికలు, కొలతలశాఖ బాధ్యులుగా నియమించింది. సచివాయాల్లో పనిచేస్తున్న వారికి వాటి విధుల గురించి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఐజాక్ మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో ఉన్న వ్యాపార సంస్థలు, రేషన్ దుకాణాలు, పాలకేంద్రాలను తూనికలు, కొలతలశాఖ యాప్‌లో నమోదు చేయాలన్నారు. తూనికలు, కొలతల శాఖ విధులు, లక్ష్యాల గురించి వివరించారు. చీరాల ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు, డీసీఐసీ కన్వీనర్ దాసరి ఇమ్మానియేల్, ఈసీడీసీ మెంబర్ శ్రీనివాసరావు, వార్డు సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

హోంగార్డు ఉద్యోగాల పేరిట శఠగోపం

- ఐపీఎస్ అధికారి, ఆయన ప్రియురాలి నిర్వాకం
- రూ.14 కోట్లకుపైగా వసూలు చేసిన వైనం
- హోంగార్డు ఐజీపీగా ఉన్న సమయంలో కొందరికి ఉద్యోగాలు
- ఆ తర్వాత మరికొందరికి నకిలీ అపాయింట్‌మెంట్లు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఓ బాధితుడు
- విచారణ చేపట్టి ప్రియురాలి అల్లుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

మంగళగిరి: హోంగార్డు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులకు ఓ ఐపీఎస్ అధికారి శఠగోపం పెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. ప్రస్తుతం వేరే శాఖలో విధులు నిర్వహిస్తున్న ఒక ఐపీఎస్ అధికారి గతంలో రాష్ట్రంలో వివిధ హోదాలలో పనిచేశారు. ఏలూరులో చేస్తున్నప్పుడు ఆ ప్రాంతానికి చెందిన ఒక మహిళతో సహజీవనం చేశారు. అనంతరం ఐజీపీ హోంగార్డు రాష్ట్ర అధికారిగా పనిచేసిన సమయంలో ఆ మహిళ కుటుంబ సభ్యులు ఐజీపీ సహకారంతో హోంగార్డు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ 200 మందికిపైగా నిరుద్యోగులు ఒక్కొక్కరి నుంచి రూ.6 నుంచి రూ.7 లక్షలు వసూలు చేశారు. అధికారి ఐజీపీగా ఉన్న సమయంలో కొందరికి హోంగార్డు ఉద్యోగాలు ఇచ్చారు. అధికశాతం మందికి పోస్టింగులు ఇవ్వలేకపోయారు. దీంతో నిరుద్యోగులు ఒత్తిడి చేయడంతో 2022లో ఐజీపీ హోంగార్డ్స్ పేరుతో తాను పోస్టులో లేకపోయినా తనే ఐజీపీ హోంగార్డు అయినట్లు సంతకాలు చేసి నకిలీ అపాయింట్‌మెంట్లు ఇచ్చారు. వాటితో అభ్యర్థులు పోలీస్ ఉన్నతాధికారులను కలవగా అనుమానం వచ్చి రహస్యంగా విచారణ చేశారు. అవి నకిలీ అపాయింట్‌మెంట్లు అని తేలడంతో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదు. అదే సమయంలో బాధిత నిరుద్యోగి తలాజి విజయ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ ప్రారంభించిన పోలీసులు విచారణలో వెలుగులోకి వచ్చిన వాస్తవాలతో విస్తుపోయినట్లు తెలిసింది. నిరుద్యోగుల నుంచి వసూలు చేసిన కొంతనగదు దళారుల ఖాతాల నుంచి ఐజీపీతోపాటు ఆయన ప్రియురాలి ఖాతాలకు వెళ్లినట్లు గుర్తించారు. వీరు హైదరాబాద్‌లో విల్లాలు కొన్నట్లు సమాచారం. దీంతో అధికారి ప్రియురాలి పెద్ద అల్లుడితోపాటు మధ్యప్రదేశ్‌కు చెందిన దళారులు ఏడుగురిని రెండు రోజుల క్రితం పోలీసులు అరెస్ట్ చేశారు. మరింత లోతుగా విచారణ చేస్తున్నారు. అరెస్టులతో అప్రమత్తమైన అధికారి మంగళవారం హైకోర్టులో ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలు చేసినట్లు పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు.

గ్రూప్-1, 2కు ఉచిత శిక్షణ

సాక్షి, నరసరావుపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-1, గ్రూప్-2 పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువతకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నామని కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం మీడియా సమావేశం జరిగింది. డాక్టర్ పి.వి.లక్ష్మయ్యతో కలిసి కలెక్టర్ మాట్లాడారు. పల్నాడులోని నిరుద్యోగ యువతకు డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ స్టడీ సర్కిల్ (ఢిల్లీ) ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, గృహిణులు, వివిధ కారణాలతో ఇంటి వద్దే పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారికి ఈ తరగతులు ఉపయోగపడతాయని వివరించారు. స్టడీ సర్కిల్ చైర్మన్ పి.వి.లక్ష్మయ్య మాట్లాడుతూ.. వెంకటపతి విద్యా దీవెన అనే కార్యక్రమం ద్వారా 2016 నుంచి ఉచిత శిక్షణ ఇస్తున్నామని, రిజిస్ట్రేషన్ కోసం www.drpvlakshmaiah.com లేదా 8500218036 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

55 మంది బాలకార్మికులకు విముక్తి


ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

పట్నంబజారు: రాష్ట్ర డీజీపీ కార్యాలయం, సీఐడీ అధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన ఆపరేషన్ స్వేచ్ కార్యక్రమంలో భాగంగా ఆయా దుకాణాల్లో పనిచేస్తున్న 55 మంది బాల కార్మికులను విముక్తి కల్పించినట్లు గుంటూరు జిల్లా ఎస్పీ ఆరీఫ్‌హాఫీజ్ మంగళవారం తెలిపారు. నవంబరు 20 నుంచి ఈనెల 10వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, ఏహెచ్‌టీయూ సిబ్బంది, కార్మిక శాఖ, ఇతర అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా హోటళ్లు, స్వీట్ షాపులు, మెకానిక్ షాపులు, షాపింగ్ మాల్స్‌తోపాటు, పలు షాపుల్లో ఆపరేషన్ స్వేచ్ఛా నిర్వహించినట్లు వెల్లడించారు. 55 మంది కార్మికులకు విముక్తి కల్పించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాలకు చెందిన చిన్నారులను వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు.

టీడీపీ 'చావు' తెలివితేటలు

- బతికున్న వాళ్లు చనిపోయినట్లుగా అర్జీలు పెట్టి మా పార్టీ మద్దతుదారుల ఓట్లు తొలగిస్తున్నారంటూ ఆర్డీవోకు ఫిర్యాదు
- తీరా విచారిస్తే అసలు అర్జీలే రాని వైనం
- అదేమంటే మాకు పార్టీ స్టేట్ ఆఫీస్ నుంచి లిస్టు వచ్చిందంటూ బుకాయింపు


ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

ప్రత్తిపాడు: అంపశయ్యపై ఉన్న టీడీపీకి ప్రాణం పోసేందుకు ఆ పార్టీ నేతలు 'చావు' తెలివి తేటలు ప్రదర్శిస్తున్నారు. ఉన్నవి లేనట్లుగా చూపిస్తూ తప్పుడు ఫిర్యాదులకు పాల్పడుతున్నారు. అదేమని ప్రశ్నిస్తే మాకు పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి లిస్టు వచ్చిందంటూ బుకాయించి, నలుక్కరుచుకుంటున్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్ అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రత్తిపాడు తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు గింజుపల్లి శివరాంప్రసాద్, ఐటీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచుమర్తి శేషు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు కాసు పెంటారెడ్డితో పాటు మరికొందరు పార్టీ నేతలు హాజరయ్యారు. గింజుపల్లివారిపాలెంలో మా పార్టీ సానుభూతిపరులు బతికే ఉన్నప్పటికీ, చనిపోయినట్లుగా చూపి వారి ఓట్లు తొలగించేందుకు ఫారం-7లను మా పార్టీ బీఎల్ఏ కోట పాటి సదాశివరావు పేరుతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారని ఆర్‌వోకు పిర్యాదు చేశారు. ఇలా బతికి ఉన్న వాళ్ల ఓట్లు తీసెయ్యడమేంటని ప్రశ్నించారు. వెంటనే స్పందించిన ఆర్‌వో శ్రీకర్ ఆన్‌లైన్‌లో అర్జీలను వెంటనే పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. అక్కడికక్కడే ఆన్‌లైన్ అర్జీలను పరిశీలించగా, అసలు ఆన్‌లైన్‌లో టీడీపీ నాయకులు చెబుతున్న ఓటరు నంబర్లుతో ఫారం-7 అర్జీలే రాలేదని నిర్ధారించారు. దీంతో ఆర్డీవో శ్రీకర్ ఆన్‌లైన్‌లో మా కార్యాలయానికే రాలేదని, ఇవి అసలు దరఖాస్తే చేయలేదని వారికి చెప్పారు. మీకు ఈ దరఖాస్తులు, ఫారాలు ఎక్కడి నుంచి వచ్చాయని టీడీపీ నేతలను ప్రశ్నించారు. ఇవి మాకు మా పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చాయని చెప్పి, అక్కడి నుంచి వెళ్లిపోయారు.

బాలోత్సవం.. ఆనందోత్సవం..

చెంగు చెంగున గంతులు వేస్తున్న లేడి పిల్లలు, తనివి తీరా వినేలా చెవులకు వింపుగా కోయిల రాగాలు, ముచ్చట గొల్పుతున్న చిన్నారుల వేషధారణలతో బాలోత్సవ్ భళా అన్నట్లుగా వీవీఐటీ ప్రాంగణం కళకళలాడింది. సినీగీతాల నృత్యాలు జానపద నృత్యాలతో వేదికలు దద్దరిల్లాయి. వాద్య సంగీతం, రాగ సంగీతంతో చిన్నారులు మైమరపించారు. సమాజంలో జరుగుతున్న సంఘటనలను కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించిన నాటికల సారాంశం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. మొత్తమ్మీద బాలోత్సవం ఆనందోత్సాహాలతో సాగింది.

- వీవీఐటీలో సందడి సందడిగా తెలుగు బాలల పండుగ
- కళలతో మంత్రముగ్ధులను చేస్తున్న చిన్నారులు



బాలోత్సవంలో వేర్వేరు అలంకరణలతో హాజరైన విద్యార్థినులు

పెదకాకాని: ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీ బాలోత్సవ్ 2023 వేడుకలు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో చిన్నారుల కేరింతలతో రెండవరోజు కోలాహలంగా కొనసాగాయి. గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలోని నంబూరు వీవీఐటీలో మూడు రోజుల బాలోత్సవ్ వేడుకల్లో భాగంగా రెండవరోజు మంగళవారం బాలోత్సవ్ నందు నూతనంగా ప్రవేశపెట్టిన శాస్త్రసాంకేతిక అంశాలలో భాగంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారి సహకారంతో నిర్వహించిన సైన్స్ ప్రయోగశాల పోటీలను ఆంధ్రప్రదేశ్ నాన్ తెలుగు రెసిడెన్స్ సొసైటీ అధ్యక్షుడు మేడపాటి వెంకట్ ప్రారంభించారు. ఈ పోటీల్లో 250 మంది విద్యార్థులు సామాజిక అంశాలతో రూపొందించిన 60 శాస్త్ర సాంకేతిక ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. రెండవరోజు పెద్ద ఎత్తున సందర్శకులు హాజరు కావడంతో బాలోత్సవ్ ప్రాంగణం సందడిగా మారింది. 280 పాఠశాలల నుంచి 4000 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. రెండవరోజు పోటీల్లో భాగంగా జానపద నృత్యాలు, నాటికలు, సంగీతం, తదితర అంశాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 350 జానపద నృత్యాలు వేదికల వద్ద సందడిగా సాగాయి. బాలబాలికలచే ప్రదర్శించిన 54 నాటికలు చిన్నారులకు సమాజం పట్ల ఉన్న దృక్పథాన్ని సామాజిక అవగాహనను వెలికితీసే విధంగా కొనసాగాయి. సమాజానికి హితవు పలికే విధంగా విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. కథ, కవిత, లేఖా రచనలు వారిలోని చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికితీశాయి. పోటీల్లో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు అనుభవాల మార్పిడి, కొత్తదనం నేర్పించడానికి ఉపయోగపడేలా న్యాయనిర్ణేతలు బోధనలు చేశారు. వాద్య సంగీతంలోని రాగ ప్రధానం, తాళ ప్రధానం ఆహుతులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు మంచిని అలవరుచుకోవాలని చెడుకు దూరంగా ఉండాలంటూ బుద్ధికి కాపలా అవసరం అంటూ రసఝురి మండలి పొన్నూరు వారిచే ప్రదర్శించిన కాపలా నాటిక విద్యార్థులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకుంది.


బాలోత్సవాన్ని వీక్షిస్తున్న కళాశాల చైర్మన్ విద్యాసాగర్‌రావు

వలసల నివారణకే ఉపాధి హామీ పథకం

రేపల్లెరూరల్: వలసల నివారించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పూర్తి స్థాయిలో పనిదినాలు కల్పించటంతోపాటు వేతన పంపిణీ సక్రమంగా జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని డ్వామా ఇన్‌చార్జి పీడీ అర్జునరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సోషల్ ఆడిట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

2020 ఏప్రిల్ నెల నుంచి 2023 మార్చి వరకు 3 లక్షల పనిదినాలలో రూ.9.32కోట్ల పనులు జరిగాయన్నారు. కూలీకు ఒక రోజుకు కనీసం రూ.272 వేతనం అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన కూలీలకు నూరు రోజుల పని దినాలు కల్పించాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు పని ప్రాంతాలలో పర్యటిస్తూ పనులు సక్రమంగా జరిగిందిలేనిది పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ సువార్త, జిల్లా విజిలెన్స్ అధికారి శోభన్, ఎంపీడీవో శివపార్వతి, ఈవోపిఆర్డీ మల్లికార్జునరావు, ఏపీవో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

2030 నాటికి ఈవీ ఇండస్ట్రీలో 50 మిలియన్ ఉద్యోగాలు

ఎన్‌ఐటీ ఏపీ ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ టీ.రమేష్


మాట్లాడుతున్న డాక్టర్ టి.రమేష్

చేబ్రోలు: విద్యార్థులు ఎలక్ట్రిక్ వెహికల్స్‌లో వినియోగించే టెక్నాలజీల మీద పట్టు సాధించినట్లెతై ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎన్‌ఐటీ ఏపీ ఈఈఈ విభాగాధిపతి టీ.రమేష్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కళాశాలలో సరెటైన్ ఆస్పెక్ట్స్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్స్ టు అచీవ్ సస్టైనబుల్ ఎనర్జీ అనే అంశంపై వారం రోజులపాటు జరగనున్న అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎన్‌ఐటీ ఏపీ ఈఈఈ విభాగాధిపతి టీ.రమేష్ మాట్లాడుతూ భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వెహికల్స్‌దేనని, దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్న జనాభా వలన ఎలక్ట్రిక్ వెహికల్స్ వినియోగం పెరిగిందన్నారు. ప్రస్తుతం ఇండస్ట్రీలకు ఎలక్ట్రిక్ వెహికల్స్ వినియోగించే టెక్నాలజీపైన అనుభవం కలిగిన వారు తక్కువగా ఉండటం ప్రధాన సమస్యగా మారిందన్నారు. ఈవీ (ఎలక్ట్రిక్ వెహికల్) ఇండస్ట్రీలో 50 మిలియన్ ఉద్యోగాలు 2030 సంవత్సరం నాటికి క్రియేట్ చేయబడుతాయన్నారు. 2026 సంవత్సరం కల్లా ఇండియన్ ఆటోమొబైల్ రంగం బిజినెస్ 300 యూఎస్ బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని తెలిపారు. ప్రిన్సిపల్ ఫణీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెల్వాన్ యూనివర్సిటీతో డాక్టర్ అంబేడ్కర్ చైర్ ఎంఓయూ


ఎంఓయూ పత్రాలను అశోక్‌కుమార్‌కు అందజేస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్

ఏఎన్‌యూ: ఈజిప్ట్ రాజధాని కైరోలోని హెల్వాన్ యూనివర్సిటీతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ డాక్టర్ అంబేద్కర్ చైర్ ఎంఓయూ కుదుర్చుకుంది. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఎంఓయూ పత్రాలను హెల్వాన్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సయిూద్ కండిల్‌కు పంపారు. కండిల్ ఏంఓయూ పత్రాలపై సంతకాలు చేసి ఏఎన్‌యూ పంపారు. ఎంఓయూ పత్రాలను వీసీ మంగళవారం అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ వై.అశోక్‌కుమార్‌కు అందజేశారు. వీసీ మాట్లాడుతూ ప్రతిష్టాత్మక ఈజిప్ట్ దేశంలోనే హెల్వాన్ యూనివర్సిటీతో జరిగిన ఎంఓయూ వర్సిటీకి మరింత ఖ్యాతిని పెంచుతోందన్నారు. బోధన, పరిశోధన, సామాజిక, సాంస్కృతిక రంగాలలో రెండు యూనివర్సిటీల మధ్య అకడమిక్, సైంటిఫిక్, కల్చరల్ అంశాల్లో పరస్పర సహకారం ఉంటుందన్నారు. సదస్సులు, ఎగ్జిబిషన్, వర్క్‌షాప్, సంభంధిత అంశాల్లో స్వల్ప వ్యవధి గల కోర్సులు, సంయుక్త ప్రాజెక్టులు నిర్వహణ, అధ్యాపకులు, పరిశోధకులు, స్టూడెంట్స్ మధ్య మార్పులు, పీజీ, పీహెచ్‌డీల్లో సంయుక్తంగా పర్యవేక్షణ చేసేందుకు అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్టర్ ఆచార్య బి.కరుణ, అంబేద్కర్ చైర్ విభాగాధిపతి ఆచార్య వై.అశోక్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అబ్రహం లింకన్, అడ్మిషన్‌ల డైరెక్టర్ డాక్టర్ అనిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

సత్తాచూపిన ఆర్యవీర్ సేహ్వాగ్



మంగళగిరి: గుంటూరు జిల్లా నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో జరుగుతున్న విజయ్ మర్చంట్ ట్రోఫీ-అండర్ -16 మూడు రోజుల క్రికెట్ పోటీలలో క్రికెటర్ సెహ్వాగ్ కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్ రెండవ రోజు అర్ధసెంచరీతో అదరగొట్టాడు. రెండవ రోజు బ్యాటింగ్ చేపట్టిన ఢిల్లీ జట్టులో కిరీ ట్ కౌసిక్ 77 పరుగులు చేయగా ఆర్యవీర్ సెహ్వాగ్ 54 పరుగులతో రాణించాడు. ఢిల్లీ జట్టు 82 ఓవర్లలో 304 పరుగులు చేసి ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన కర్ణాటక జట్టులో అమోగ్ ఆర్ షెట్టి 65 పరుగులతో రాణించగా రెండవ రోజు మంగళవారం ఆట ముగిసే సమయానికి కర్ణాటక జట్టు 36 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 103 పరుగులు చేసింది. రెండవ రోజు ఢిల్లీ జట్టు కర్ణాటక జట్టుపై 57 పరుగుల ఆధిక్యంలో వుంది.

'లింగ నిర్ధారణ' చట్టరీత్యా నేరం

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు అధ్యక్షతన గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక చట్టం 1994పై జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కానింగ్ సెంటర్ వైద్యులు, వైద్య సిబ్బందికి వర్క్‌షాపు జరిగింది. వర్క్‌షాపులో డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ ప్రతి స్కానింగ్ సెంటర్‌ను తప్పనిసరిగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో రిజిస్ట్రరు చేయాలన్నారు. రిజిస్ట్రేషన్, రెన్యూవల్ చేసిన స్కానింగ్ చేయించిన సెంటర్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గర్భంలో శిశువు లింగ నిర్ధారణ చేసి చెప్పడం చట్టరీత్యా నేరమని, అలా చెప్పిన వారికి, అడిగిన వారు చట్టరీత్యా శిక్షార్హులని పేర్కొన్నారు. జీజీహెచ్ గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జయంతి మాట్లాడుతూ ఆడపిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్కానింగ్ సెంటర్‌ల వారు ఏవిధంగా స్కానింగ్ వివరాలు ఫారం ఎఫ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వివరించారు. కార్యక్రమంలో డెమో జయప్రసాద్, హెచ్‌ఈఈఓ చంద్రశేఖర్, డెప్యూటీ డెమో ఎస్.వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ ఇస్మాయిల్, లీగల్ కన్సల్టెంట్ వాణి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల్లో స్వైపింగ్ సదుపాయం

- ఆన్‌లైన్ ద్వారా అన్నీ లావాదేవీలు
- నగదు రహిత చెల్లింపులకు చర్యలు
- పల్నాడు జిల్లాలో 527 గ్రామ పంచాయతీలు, 416 సచివాలయాలు



పంచాయతీలకు క్యూర్ కోడ్‌లను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ సత్య నారాయణ, ఈఓపీఆర్‌డీ దయాసాగర్

సత్తెనపల్లి: జిల్లాలోని అన్ని సచివాలయాల్లో స్వైపింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో పన్నులు, వివిధ సేవల రుసుం చెల్లింపునకు నగదు రహిత లావాదేవీలకు అవకాశం కల్పించారు. అందులో భాగంగా ఈ-పోస్(స్వైపింగ్) యంత్రాలు, క్యూఆర్ కోడ్‌లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తోంది. జిల్లాలో 527 గ్రామ పంచాయతీలు, 416 గ్రామ సచివాలయాలున్నాయి. మూడు వేల జనాభా కంటే తక్కువ ఉన్న గ్రామ పంచా యతీలు 346 ఉండగా, మూడు వేల జనాభా కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామపంచాయతీలు 181 ఉన్నా యి. అందులో మూడు వేల జనాభా కంటే తక్కువ ఉన్న గ్రామపంచాయతీలకు 324 క్యూఆర్ కోడ్‌లను, మూడు వేల జనాభా కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు 72 ఈ-పోస్ యంత్రాలను ఇప్పటి వరకు అందించారు. ఇంకా 131 పంచాయతీలకు రావాల్సి ఉంది.

ఆన్‌లైన్ చెల్లింపులు..

మొత్తం 527 పంచాయతీల్లో ఆన్‌లైన్ చెల్లింపులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి నగదు రహిత విధానం ప్రారంభమైనా పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు ఈ-పోస్ యంత్రాల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. పంచాయతీలో నగదు రహిత లావాదేవీలు అన్నీ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా నిర్వ హిస్తున్నారు. ఆయా గ్రామ పంచాయతీలు బ్యాంకు ఖాతాలను తెరిచారు. గ్రామ పంచాయతీల ద్వారా సేవలు పొందే లబ్ధిదారులు నిర్ణీత రుసుంతో పాటు ఇంటి యజ మానులు ఏటా చెల్లించే ఇంటి పన్ను కూడా డిజిటల్ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. వివిధ రకాల డేబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లింపులు జరిపేలా ఈ-పోస్ యంత్రాలు ఇచ్చారు. పన్నులకు సంబంధించి ప్రతిదీ లెక్క పక్కగా నమోదు చేస్తున్నారు. ఏ పంచాయతీ పరంగా ఎంత మొత్తం పన్నులు వసూలయ్యాయి? ఎంత కావాలనే? విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. కార్యదర్శుల పని తీరు ఉన్నతాధికారులు తెలుసుకొని పర్యవేక్షించే సౌలభ్యం ఉంటుంది.

ప్రయోజనాలు...

- ఈ- పోస్ యంత్రాల ద్వారా చెల్లించిన వెంటనే రసీదు పొందవచ్చు.
- చెల్లింపు పూర్తి అయిన వెంటనే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు అవుతాయి.
- అన్ని బ్యాంకుల ఏటీఎం కార్డులు, క్రెడిట్ కార్డుల ద్వారా ఈ-పోస్ యంత్రంలో స్వైపింగ్ చేయవచ్చు.
- ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, ఇతర యాప్‌ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను వినియోగించవచ్చు.
- అవినీతికి అవకాశం లేకుండా పన్నుల ఆదాయం పంచాయతీ ఖాతాకు జమ అవుతోంది.
- చెల్లింపులు సులభంగా, వేగంగా పూర్తవుతాయి.

నగదు తీసుకుంటే క్రిమినల్ కేసులు



పంచాయతీలో అన్ని లావాదేవీలు ఆన్‌లైన్‌లోనే జరగాల్సి ఉంది. పన్నుల వసూళ్లు, వివిధ రుసుంల చెల్లింపునకు ఈ-పోస్ యంత్రాలు, క్యూ ఆర్ కోడ్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. ఇప్పటికే పంచాయతీలకు క్యూఆర్ కోడ్‌లు, ఈ-పోస్ యంత్ర పరికరాలను అందజేశాం. నేరుగా నగదు తీసుకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఆదేశాలు కూడా ఇచ్చాం. డిజిటల్ చెల్లింపులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలందరూ సహకరించి ఆన్‌లైన్ చెల్లింపులు అలవాటు చేసుకోవాలి. దీనిపై ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కూడా ఇచ్చాం.

–ఎంపీ భాస్కరరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి, పల్నాడు

నవ దిశ

ఆర్టికల్ 370 ఎత్తివేతను సుప్రీంకోర్ట్ సమర్థించింది. జమ్ము-కశ్మీర్‌లకు రాష్ట్రహోదా ఇచ్చి ఎన్నికలు నిర్వహించమంది. మరోవైపు అక్కడ యువగళాలు మారుతున్న కశ్మీర్‌ను గానం చేస్తున్నాయి. 14 ఏళ్ల ర్యాపర్ హుమైరా జా విడుదల చేసిన పాట 'బదల్తా కశ్మీర్' మార్పును ఆహ్వానిస్తూ కొత్త ఆశను రేపుతోంది. హుమైరా జా పాటను భారత ప్రభుత్వం ఇన్‌స్టాలో షేర్ చేసింది. 'నేను ఇలాగే ముందుకెళ్తాను' అంటున్న హుమైరా పరిచయం.



హుమైరా జా

బదల్తా కశ్మీర్

'బద్‌లా జో కశ్మీర్... బద్‌లా హై సారా దౌర్' అని పాడుతోంది హుమైరా జా.

'కశ్మీర్ మారుతోంది... కశ్మీర్ ధోరణి మారుతోంది... అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది' అంటూ ఆమె పాడిన పాట ఇప్పుడు కశ్మీర్‌వాసులనే కాదు, దేశాభిమానులను కూడా ఆకర్షిస్తోంది. హుమైరా ఈ పాటను ఎం.సి.రా అనే మరో ర్యాపర్ కలిసి పాడింది. కశ్మీర్‌లో తాజా అభివృద్ధి పరిణామాలను పాటలో మిళితం చేస్తూ వీరు విడుదల చేసిన 'బదల్తా కశ్మీర్' పాట కశ్మీర్ భవిష్యత్తు మీద ఆశను కలిగిస్తోంది.

'మా నానమ్మ, తాతయ్యల కాలంలో కశ్మీర్ ఎలా ఉండేది... (ఆర్టికల్ 370 ఎత్తేశాక) ఇప్పుడు ఎలా ఉందనేది నేను వారి మాటల్లో విన్నాను. నా కళ్లారా చూశాను. ఇక్కడ జరిగిన జి 20 సమ్మిట్, శ్రీనగర్‌ను స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దడం, కొత్త టన్నెల్స్ ఏర్పాటు... ఇంతకు ముందు చూడలేదు. మా ఊరు కంగన్ నుంచి శ్రీనగర్‌కు వెళ్లాలంటే గతంలో గంటన్నర పట్టేది. ఇప్పుడు గండర్‌బల్ దగ్గర బ్రిడ్జి కట్టాక ముప్పై నిమిషాల్లో వెళ్లిపోతున్నాము. ఇదంతా మారుతున్న కశ్మీరే' అంటుంది హుమైరా జా.

తొమ్మిదో తరగతి చదువుతున్న హుమైరా అలవోకగా ర్యాప్ సాంగ్స్ రాసి పాడుతుంది. హిందీ, ఉర్దూ, ఇంగ్లిష్ పదాలను టక్కున పట్టేట్టుగా వాడుతూ పాటలు రాసి పాడటం వల్ల గతంలోనే గుర్తింపు పొందినా 'బదల్తా కశ్మీర్' పాటతో ప్రపంచానికి తెలిసింది.

'నేను రెండో క్లాస్‌లో ఉండగా యోయో హనీసింగ్ రాప్ ఆల్బమ్ విన్నాను. అది నాకు చాలా నచ్చింది. ఆ వయసులోనే అలా ర్యాప్ పాటలు ట్రై చేసేదాన్ని. అప్పుడే బజ్‌రంగి భాయిజాన్ (2015) సినిమా షూటింగ్ మా ఏరియాలో జరిగితే అందులోని బాల నటి హర్షాలికి నేను బాడీ డబుల్ (డూప్)గా నటించాను. అలా నేను కూడా సినిమాల్లో నటించాలనుకున్నానుగానీ మా కశ్మీర్‌లో సినిమా పరిశ్రమ లేదు. అందుకని ర్యాపర్‌గా రాణించాలని నిశ్చయించుకున్నాను' అంటుంది హుమైరా.

కశ్మీర్‌లో ప్రతి ఏటా జరిగే 'ర్యాప్ బ్యాటిల్' పోటీల్లో పాల్గొని 2022, 2023 సంవత్సరాల్లో టైటిల్ గెలిచింది హుమైరా. '2022లో 15 మంది అబ్బాయిలు నాకు పోటీగా వచ్చారు. నేను ఒక్కదాన్నే ఆడపిల్లను. నేనే గెలిచాను' అంటుంది హుమైరా. 'కశ్మీర్‌లో అమ్మాయిలు స్పోర్ట్స్‌లో, కళల్లో, చదువులో, ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. ఆ విషయాన్ని నా పాటలో చెప్పాను' అందామె.

ఈ పాటలోనే మేల్ వాయిస్ ఇచ్చిన ఎం.సి.రా 'ఇక్కడ ఇప్పుడు జీన్స్ ప్యాంట్ అమ్మాయిలు తొడుక్కుంటున్నారు. బట్టల్ని బట్టి వారిని జడ్జ్ చేసే రోజులు పోయాయి' అనే లైన్‌లు పాడాడు. హుమైరా, ఎం.సి.రా కలిసి 'మై కశ్మీరి... మేరా దేశ్ హై హిందూస్తాన్' అని పాటను ముగిస్తారు.



హుమైరా జా

ఈ పాటలో హుమైరా 'టెర్రరిస్టులకు ఇక్కడ చోటు లేదు. అనవసరంగా ఎవరి రక్తం పారడానికి వీల్లేదు' అనే లైన్లు పాడింది. 'నువ్వు చూపుతున్న అభివృద్ధి ఉత్తుత్తదే. అసలు వాస్తవం వేరే ఉంది అని కొందరంటున్నారుగా' అని విలేకరులు ప్రశ్నిస్తే 'అది వారి దృష్టికోణం. ఇది నా దృష్టికోణం' అంటుంది హుమైరా.

'కొంతమంది నన్ను ట్రోల్ చేస్తున్నారు. నేను పట్టించుకోను. నేను ఇలాగే ముందుకెళతాను. నా వెనుక ఒక్కరు నిలబడినా చాలు' అందామె.

కశ్మీర్ వెనుక హుమైరా వెనుక ఇప్పుడు చాలామంది ఉన్నారు. కశ్మీర్ అభివృద్ధికి అందరూ ప్రయత్నిస్తే 'నయా కశ్మీర్' దగ్గరిలోనే సాధ్యమవుతుంది.

ఛావీ రాజావత్ రాజస్థాన్‌లోని సోడా గ్రామంలో పుట్టి పెరిగింది. పట్నంలో ఉన్నత చదువులు చదివి, కళ్లు చెదిరే ప్యాకేజీతో కార్పొరేట్ ఉద్యోగంలో చేరింది. కానీ, చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి గ్రామానికి వెళ్లింది. సర్పంచ్‌గా ఎన్నికల్లో నిలబడి గెలిచింది. పదేళ్లపాటు సర్పంచ్‌గా పనిచేసింది. మొదటి ఎంబీయే మహిళా సర్పంచ్‌గా వార్తల్లో నిలిచి, యుఎన్‌లో ప్రసంగం చేసింది. గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దింది. ఇప్పుడు గ్రామాభివృద్ధికి కృషి చేస్తూనే, హోటల్ వ్యాపారం చేస్తోంది. ఆసక్తి గలవారికి గుర్రపు స్వారీలో శిక్షణ ఇస్తోంది.

ఊరు రమ్మంది..!

ఒక ఎంబీయే సర్పంచ్.. ఒక మోడల్ గ్రామం

"2010లో తొలిసారి సర్పంచ్ అయినప్పుడు గ్రామ పరిస్థితి ఏ మాత్రం బాగా లేదు. గ్రామం తీవ్ర కరువుతో అల్లాడిపోయింది. సాగునీరు లేదు. 13–14 సంవత్సరాలుగా రుతుపవనాలు లేవు. భూగర్భ జలాలను వాడుకోలేకపోయేవారు. 3–4 గంటలకు మించి విద్యుత్ సరఫరా లేదు. రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. డ్రెనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా ఉంది. ఈ సవాళ్లతో సోడా పంచాయితీ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టాను. మొదటి టర్మ్‌లో కొన్ని పనులు పూర్తయ్యాయి.

మా ఊరు తనవైపు లాగింది..

మా తాత బ్రిగేడియర్ రఘుబీర్‌సింగ్ 1990 వరకు సర్పంచ్‌గా చేశారు. నాకు మా ఊరు అంటే ఎప్పుడూ ఇష్టమే. బెంగుళూరులోని రిషి వ్యాలీ స్కూల్, జైపూర్‌లోని మాయో కాలేజీ గర్ల్స్ స్కూల్‌లో చదువుకున్నాను. వేసవి సెలవులు వచ్చినప్పుడల్లా మా ఊరిలోనే ఉండేదాన్ని. ఢిల్లీలోని మహిళా శ్రీరామ్ కాలేజీ నుండి డిగ్రీ తీసుకున్నాక, పూణెలోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మోడ్రన్ మేనేజ్‌మెంట్ నుండి ఎంబీయే పూర్తి చేశాను. ఏడేళ్ల పాటు కార్పొరేట్ సెక్టార్‌లో వర్క్ చేశాను. లక్షల రూపాయల జీతం. కానీ, మా ఊరు వైపు నన్ను తన వైపు లాగింది.

■ మహిళకు రిజర్వ్ అని..

2010లో మా గ్రామ పంచాయితీ మహిళలకు రిజర్వ్ చేయబడింది. అప్పుడు మా ఊరి పెద్దలు నన్ను ఎన్నికల్లో నిలబడమని అడిగారు. ఆ సమయంలో సర్పంచ్‌ని అవ్వాలనే ఆలోచన కూడా చేయలేదు. గ్రామస్తులు మా అమ్మ నాన్నలను అడిగారు. 'ఏం చేయాలనుకున్నా తన ఇష్టం, మా బలవంతం ఉండదు' అని చెప్పారు. నాకు అప్పటి వరకు గ్రామ సభలు ఎలా జరుగుతాయి, పంచాయితీలకు నిధులు ఎలా వస్తాయో తెలియదు. ఆ విషయాలను గ్రామస్తులే చెప్పారు. ఆ విధంగా పంచాయితీ ఎన్నికల్లో నిలబడి, గెలిచాను. మా ఇంట్లో మా తాత తర్వాత నేను సర్పంచ్‌ని అయ్యాను.

■ వర్షపు నీటి సంరక్షణ

ముందుగా ఊరి భవితవ్యాన్ని ఒంటరిగా మార్చలేమని, ప్రజలంతా కలిసికట్టుగా కృషి చేస్తేనే గ్రామం అభివృద్ధి చెందుతుందని అందరికీ స్పష్టంగా చెప్పాను. నేను వ్యూహంతో పనిచేయడం ప్రారంభించాను. ప్రభుత్వం, ప్రైవేట్ రంగం, గ్రామాలను అనుసంధానించడం, కరువును ఎదుర్కోవడం నేను ఎదుర్కొన్న అతిపెద్ద సవాళ్లు. గ్రామంలోని నీటివనరులన్నీ పూడికతో నిండిపోయాయి. సుమారు 100 ఎకరాల్లో విస్తరించి ఉన్న నీటి వనరుల్లో పూడిక మట్టిని తొలగించేందుకు లక్షల రూపాయలు సేకరించి, ఖర్చు చేశాం.

■ మహిళలు ముందు

గ్రామపంచాయితీ నా కుటుంబం లాంటిది. నేను మీటింగులు పెట్టడం మొదలు పెట్టగానే ఏయే ప్రాజెక్టుల్లో ఎలా పనిచేస్తున్నానో చెప్పేదాన్ని. ఈ ప్రాజెక్టుల గురించి వారు ఏమనుకుంటున్నారో అందరి అభిప్రాయాలు తెలుసుకునేదాన్ని. అలాగే, ఎంత డబ్బు ఖర్చు అవుతుందో కూడా వివరించేదాన్ని. పనులు సజావుగా అయ్యేలా అధికారులను కలిసి ఆరా తీయమని గ్రామస్తులకు చెప్పేదాన్ని. మహిళల బృందం డిజైనర్ ల్యాంప్‌లు, కొవ్వొత్తులు, మసాలా దినుసులు వంటి ఉత్పత్తులు తయారు చేయడం మొదలుపెట్టారు. ఇవి మంచి ధరకు అమ్ముడు పోవడం మొదలయ్యింది. దీంతో మహిళల జీవితం మెరుగుపడింది. రెండేళ్లలో 950 ఇళ్లకు గాను 800 మరుగుదొడ్లు నిర్మించాం. 24 గంటలూ కరెంట్ అందుబాటులోకి వచ్చింది.

■ రోడ్ల ప్రాధాన్యత

నా ఎజెండాలో రోడ్ల ప్రాధాన్యత స్పష్టంగా ఉంచాను. ముందు ప్రైవేట్ బస్సుల సహాయం తీసుకున్నాను. బాలికల కోసం పాఠశాల, మహిళల స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేశాను. మూతపడిన బి.ఎడ్ కాలేజీని స్వాధీనం చేసుకొని దానిని బాలికల చదువుకోసం కేటాయించాను. ఓ ప్రైవేట్ కంపెనీ 200 టేబుళ్లు, బెంచీలను అందజేసి మా వెన్నుతట్టింది.



ఛావీ రాజావత్





■ అందరికీ బ్యాంకు ఖాతా..

సర్పంచ్ అయిన ఐదేళ్లలోనే రోడ్లు, డ్రైన్లు, అందరికీ బ్యాంకు ఖాతా తెరిపించాను. ఎప్పుడూ ఫీల్డ్ వర్క్‌లోనే ఉండేదాన్ని. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాల, చదువు ప్రాముఖ్యతను వివరించేదాన్ని.. నా స్వభావం అందరినీ కలుపుకొని ఉంటుంది. ఐక్యరాజ్య సమితి 11వ ఇన్ఫో పావర్టీ వరల్డ్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించినప్పుడు మొదటిసారి భారతదేశం నుండి ఒక మహిళా సర్పంచ్‌గా దేశం తరపున ప్రాతినిధ్యం వహించాను. ఇది నాకు గర్వంగా అనిపించింది. అక్కడ వారందరి మదిలో సర్పంచ్ అంటే తలపై ముసుగు వేసుకుని ఉన్న గ్రామస్థురాలు అనుకున్నారు. కానీ, నన్ను కార్పొరేట్ లుక్‌లో చూసి అందరూ ఆశ్చర్యపోయారు. సోడా విలేజ్ అభివృద్ధికి డబ్బు కంటే వ్యక్తులు, అందరి సమష్టి కృషి అవసరం అని ఫోరమ్‌లో చెప్పాను.

రెండుసార్లు సర్పంచ్‌గా నా విధులను నిర్వర్తించాను. తర్వాతి వారికి అవకాశాలు ఇవ్వాలని నేను మళ్లీ పోటీ చేయలేదు. ఇప్పుడు హోటల్‌ని నిర్వహిస్తున్నాను. గుర్రపు స్వారీ వచ్చు కాబట్టి, ఆసక్తి గలవారికి శిక్షణ ఇస్తున్నాను' అని వివరిస్తుంది ఈ యంగ్ లీడర్.

"ఎదుటి వారు చెప్పేది శ్రద్ధగా వింటే మనకు తెలియని ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయి. ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీబాత్ కార్యక్రమంలో అనేక విషయాలను ప్రస్తావిస్తుంటారు. వాటిలో ఒకటి నన్ను ఏకంగా ఎంట్రప్రెన్యూర్‌గా మార్చింది. ఈరోజు నేను ఆర్గానిక్ ఎంట్రప్రెన్యూర్‌గా ఎదిగాను. అదే మన్‌కీ బాత్ కార్యక్రమంలో నన్ను ప్రశంసించడం ఎంతో సంతోషంగా ఉంది" అని చెబుతూ తెగ మురిసిపోతోంది వర్ష.



వర్ష

బాత్ చూపిన బాట

కర్ణాటకలోని చామరాజ్‌నగర్ జిల్లా ఆలహళ్లీ గ్రామానికి చెందిన వర్ష ఎమ్‌టెక్ చదివింది. చదువు పూర్తి కాగానే అందరిలా ఉద్యోగం కోసం చూడకుండా సరికొత్తగా ఏదైనా చేయాలనుకుంది. ఈ క్రమంలోనే ఏం చేయాలా అని ఆలోచిస్తున్న వర్ష.. ఓ రోజు అనుకోకుండా మన్‌కీబాత్ వినింది. ఆ కార్యక్రమంలో అరటి ఆకులను ఉపయోగపడే వనరులుగా ఎలా మారుస్తున్నారో మోదీ ప్రస్తావించారు. ప్రకృతిని ఇష్టపడే వర్షకు ఇది బాగా నచ్చడంతో.. అరటి బోదె, ఆకులతో హ్యాండిక్రాఫ్ట్స్ తయారు చేయాలని నిర్ణయించుకుంది.



వీడియో చూసి...

అరటి కాండాలను ఉపయోగపడే వస్తువులుగా ఎలా మార్చాలో వర్షకు తొలుత అర్థం కాలేదు. తరువాత యూట్యూబ్‌లో వెతికి ఒక వీడియో ద్వారా కొంత సమాచారం తెలుసుకుంది. కోయంబత్తూరు, తమిళనాడులోని మరికొన్ని ప్రాంతాల్లో అరటి వ్యర్థాలను అందమైన వస్తువులుగా ఎలా మారుస్తున్నారో వివరంగా తెలుసుకుంది. ఆ తరవాత వ్యాపారానికి కావాల్సిన యంత్రాలను కొనుగోలు చేసి ఉమ్మతూరు సమీపంలో 'ఆకృతి ఇకోఫ్రెండ్లీ' పేరిట ఎంటర్‌ప్రైజ్‌ను ఏర్పాటు చేసింది.

అరటికాండాలు, ఆకులను సేకరించి యంత్రాలతో ప్రాసెస్ చేసి నారతీసి, ఫ్లోర్‌మ్యాట్స్, బ్యాగ్స్, పర్సులు, హ్యాండీ క్రాఫ్ట్స్, అరటి గుజ్జు నుంచి తీసిన రసంతో సహజసిద్ధమైన ఎరువులు తయారు చేసి విక్రయిస్తోంది. కష్టమర్ల నుంచి మంచి ఆదరణ లభించడంతో ఆర్గానిక్ షాపులు, గూగుల్, ఫ్లిప్‌కార్ట్, అమేజాన్ వంటి ఆన్‌లైన్ షాపుల్లో సైతం ఆకృతి వస్తువుల విక్రయాలు జరుగుతున్నాయి. ఇలా అరటి వ్యర్థాలను అందమైన వస్తువులుగా మారుస్తూ కొంతమందికి ఉపాధి కల్పించడంతోపాటు.. రైతులకు ఆదాయం వచ్చేలా చేస్తోంది వర్ష.

వర్ష తన భర్త శ్రీకాంత్ సాయంతో చేస్తున్న ఈ ఇకో–ఫ్రెండ్లీ బిజినెస్ గురించి తెలియడంతో కొన్ని కంపెనీల నుంచి భారీగా ఆర్డర్లు వస్తున్నాయి. "భవిష్యత్‌లో తన వ్యాపారాన్ని మరింత విస్తరించి ఎక్కువమందికి ఉపాధి కల్పిస్తాను" అని వర్ష చెబుతోంది. గ్రామాల్లోని మహిళలు సైతం వ్యాపారవేత్తలుగా మారేందుకు, ఉద్యోగం దొరకనివారు ఉపాధిని ఇలా సృష్టించుకోవచ్చని చెప్పడానికి ఉదాహరణగా నిలుస్తోంది వర్ష. నవంబర్ నెల మన్‌కీ బాత్ కార్యక్రమంలో వర్ష ఎంట్రప్రెన్యూర్ జర్నీ గురించి మోదీ ప్రస్తావించడం విశేషం.

కొత్త సంవత్సరం దగ్గరలో ఉంది.
కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ 'హ్యాపీ న్యూ ఇయర్' పాట పాడగానే సరిపోతుందా?
'పాటతోపాటు ప్రణాళిక కూడా ఉంది' అంటుంది మన జెన్ జెడ్.
కొత్త సంవత్సరంలో జెన్ జెడ్ లక్ష్యాలు, ప్రణాళికలు, అభిరుచులకు సంబంధించి 'ట్రెండ్ టాక్ రిపోర్ట్-2024' అద్దం పడుతోంది.

యూత్ పల్స్

Generation Z

భవిష్యత్ చిత్ర 'వర్ణ'మాల

ఇండియా, యుఎస్, యూకే, బ్రెజిల్, సౌత్ కొరియా దేశాలలోని జెన్ జెడ్ ట్రెండ్స్‌కు సంబంధించి 'ట్రెండ్ టాక్ రిపోర్ట్'ను విడుదల చేసింది ఇన్‌స్టాగ్రామ్. వర్త్ గ్లోబల్ స్టైల్ నెట్‌వర్క్ (డబ్ల్యూజీఎస్ఎన్)తో కలిసి నిర్వహించిన ఈ సర్వేలో 2024 సంవత్సరానికి సంబంధించి ఫ్యాషన్, బ్యూటీ, సోషల్ మీడియా, ఫ్రెండ్‌షిప్‌కు సంబంధించిన ప్రశ్నలు జెన్ జెడ్‌ను అడిగారు.

ఈ రిపోర్ట్ ప్రకారం ఫ్యాషన్ ట్రెండ్స్, బ్యూటీ అండ్ ఫుడ్ విభాగాలలో మన దేశం ట్రెండ్ సెట్టర్‌గా ఉంది. ఫుడ్ విషయానికి వస్తే కొత్త రుచులను ఆస్వాదించడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇతరుల కంటే భిన్నంగా కనిపించే వస్త్రధారణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కొత్త హెయిర్‌స్టైల్‌ను ఎంపిక చేసుకుంటున్నారు.

2024కు సంబంధించి 'జెన్ జెడ్' ప్రాధాన్యతలలో హెల్త్, ట్రావెల్, కెరీర్‌లు మొదటి స్థానంలో ఉన్నాయి.

తమ కెరీర్‌పై ప్రధానంగా దృష్టి పెట్టబోతున్నట్లు 43 శాతం మంది తెలియజేశారు. ఇతర దేశాలతో పోల్చితే మన 'జెన్ జెడ్' వ్యాపారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. సంపద సృష్టికి వ్యాపారమే మార్గం అని చెబుతోంది.

మన దేశంలో 'జెన్ జెడ్'లో ఎక్కుమంది స్పోర్ట్స్‌కు సంబంధించి సూపర్ ఫ్యాన్స్ ఉన్నారు.

లైఫ్ అడ్వైజ్, తమ ప్రొఫెషన్‌కు సంబంధించి కంటెంట్‌కు ప్రాధాన్యత ఇచ్చేవారి సంఖ్య ఎక్కువగానే ఉంది.

జీఆర్‌డబ్ల్యూఎం(గెట్ రెడీ విత్ మీ)లాంటి క్రియేటివిటీతో కూడిన ఫ్యాషన్ ట్రెండ్స్‌పై అమిత ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. మన దేశంలో జెన్ జెడ్‌లో 44 శాతం మంది సొంత ఆలోచనలకు ప్రాధాన్యత ఇచ్చే డీఐవై(డూ–ఇట్–యువర్ సెల్ఫ్) విధానాన్ని ఇష్టపడుతున్నారు.

సంగీతం విషయానికి వస్తే ఏఆర్ రెహమాన్, శ్రేయా ఘోషల్, అనిరుథ్ నుంచి సౌత్ కొరియన్ మ్యూజిక్ బ్యాండ్ 'బీటీఎస్ ఆర్మీ' వరకు ఇష్టపడుతున్నారు. వారికి నచ్చిన వీడియో గేమ్స్‌లో ఫోర్ట్‌నైట్, కాల్ ఆఫ్ డ్యూటీ, రాబ్లక్స్... మొదలైనవి ఉన్నాయి.

గుడ్ ప్లానింగ్

2024లో యువతరం ఆసక్తి చూపుతున్న రంగాలలో ట్రావెల్ ఒకటి. ట్రావెల్ ప్రేమికులకు టాన్యాలాంటి ట్రావెల్ వ్లోగర్‌ల సలహాలు ఉపయోగపడుతున్నాయి. అడ్వర్‌టైజింగ్ రంగంలో ఉద్యోగం చేసిన టాన్యా సోలోగా ట్రావెలింగ్ మొదలుపెట్టి తాను వెళ్లిన ప్రదేశాలకు సంబంధించి వ్లోగింగ్ మొదలు పెట్టింది. యూట్యూబ్, ఎయిర్‌టెల్‌లాంటి పెద్ద కంపెనీలతో కలిసి పనిచేసింది. ట్రావెలింగ్‌పై ఆసక్తి ఉన్నవారికి గుడ్ ప్లానింగ్ అనేది ముఖ్యం అంటుంది టాన్యా. 'గుడ్ ప్లానింగ్'కు సంబంధించి టిప్స్ చెబుతుంటుంది.





ప్రణాళిక ఉండాలి

దిల్లీకి చెందిన మానికా మాలిక్ బిజినెస్ అండ్ ఫైనాన్స్‌కు సంబంధించి కంటెంట్ క్రియేటర్‌గా చిన్న వయసులోనే పెద్ద పేరు తెచ్చుకుంది. పర్సనల్ ఫైనాన్స్ నుంచి స్టాక్‌మార్కెట్ వరకు ఎన్నో విషయాలను సులభంగా అర్థమయ్యేలా చెబుతోంది. 'ఒక రంగంపై ఇష్టం ఉన్నంత మాత్రాన విజయం చేరువ కాదు. భవిష్యత్ ప్రణాళిక తప్పనిసరిగా ఉండాలి. పరిశ్రమకైనా, వ్యక్తికైనా ఇది ముఖ్యం' అంటుంది మాలిక్.

జెన్ జెడ్‌లోని పదిమందిలో తొమ్మిదిమంది వారు ఇష్టపడే రంగాలకు సంబంధించి సెలబ్రిటీల అభిమానగణంలో ఉన్నారు. తమ అభిమాన సెలబ్రిటీలు, అథ్లెట్లు, క్రియేటర్ నుంచి జెన్ జెడ్ రాబోయే కాలంలో ఆశిస్తున్నది ఏమిటి? అనే ప్రశ్నకు వినిపించే జవాబు... లైఫ్ అడ్వైజెస్, వారి ప్రొఫెషన్‌కు సంబంధించిన కంటెంట్... ఇక మీమ్స్ విషయానికి వస్తే మూడింట ఒక వంతు మంది 'బ్యాడ్ టేస్ట్ మీమ్స్'ను తమ 'టాప్ టర్న్ ఆఫ్'గా ఎంచుకున్నారు.

గతం సంగతి ఎలా ఉన్నా భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి నిర్ణయాత్మక నిర్ణయాలు తీసుకోవడంలో యువతరం ముందు ఉంటుంది. అభిరుచుల నుంచి కెరీర్ ఆప్షన్స్ వరకు కొత్తగా ఆలోచిస్తోంది.

'కాలేజీ చదువు పూర్తయిన తరువాత వైట్–కాలర్ జాబ్ తెచ్చుకోవాలి' అనేది సంప్రదాయ ఆలోచన. అయితే యువతరంలో అందరూ ఇలాగే ఆలోచించడం లేదు. 'కంఫర్టబుల్ లైఫ్‌స్టైల్'కు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం లేదు. దీనికి కారణం జెనరేటివ్ ఏఐ. జెనరేటివ్ ఏఐ ప్రభావంతో వైట్–కాలర్ జాబ్స్‌కు ఉద్యోగభద్రత తక్కువ అనే అభిప్రాయం ఉంది. పియర్సన్ రిపోర్ట్ ప్రకారం జెనరేటివ్ ఏఐ వల్ల వైట్–కాలర్ ఉద్యోగాలలో 30 శాతం రిప్లేస్‌మెంట్ జరుగుతుంది. వైట్–కాలర్ జాబ్‌లతో పోల్చితే బ్లూ–కాలర్ జాబ్‌లకు అధిక ఉద్యోగ భద్రత ఉంది. రోబోట్స్ చేయలేని పనులు వీటిలో ఉండడమే కారణం. ఈ పనులు చేయడానికి ప్రత్యేక శిక్షణ, నైపుణ్యం అవసరం. అయితే జెన్ జెడ్‌లో ఎక్కువమంది ఈ హై–డిమాండ్ ఫీల్డ్‌పై ఆసక్తి ప్రదర్శించడం లేదు.

వైట్–కాలర్ జాబ్, బ్లూ–కాలర్ జాబ్ అనేదానితో సంబంధం లేకుండా ప్రతి ఉద్యోగికి విశ్లేషణాత్మక ఆలోచన విధానం, సమస్య పరిష్కార నైపుణ్యం, సమర్థవంతమైన కమ్యూనికేషన్, స్ట్రెస్ మెనేజ్‌మెంట్ స్కిల్స్... మొదలైన వాటికి సంబంధించి ప్రొఫెషనల్ స్కిల్స్ అవసరం. వీటిపై జెన్ జెడ్ ఆసక్తి ప్రదర్శిస్తోంది.

నిర్ణయాలు తీసుకోవడంలో 'లైఫ్‌స్టైల్' అనేది కీలకపాత్ర పోషిస్తోంది. డబ్బు నుంచి ఫ్రీ టైమ్ అండ్ ఫ్లెక్సిబిలిటీ వరకు ఎన్నో విషయాలను దృష్టిలో పెట్టుకుంటుంది జెన్ జెడ్.